క్లుప్తంగా

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల క్రిష్టప్ప వీధిలోని ఉమా సహిత చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా శివరాత్రిని పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పార్వతీ సమేత పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు.

ముగిసిన అశ్వత్థం బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. అశ్వత్థ నారాయణస్వామి, గణపతి, శింగర బట్టు, శ్రీచక్రభీమలింగేశ్వర స్వాములకు ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పలుచోట్ల అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. పెన్నానదిలోని స్నానఘట్టాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ పర్యవేక్షించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు ఏర్పాటు చేశారు. పెద్దపప్పూరు చితంబరస్వామి, అశ్వత్థం వద్ద నిర్వహించిన రంగస్థల నాటక ప్రదర్శనలు అహుతులను ఆకట్టుకున్నాయి.

శివ సేవా పరాయణులకు సన్మానం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో విశేష సేవలందించిన సేవా పరాయణులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాఘమాసమంతా ఆలయంలో వివిధ సేవలు అందించిన సేవా పరాయణకులకు శాలువాలు కప్పి సత్కరించారు. నూతన వస్త్రాలను బహూకరించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మురళీధర్‌గుప్తా, సభ్యులుకవి నారాయణమూర్తి, వెంకట్రాముడు, యంగమ్మ, ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ, అర్చకులు చంద్రా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కరిడికొండ గ్రామానికి చెందిన నరేష్, సాయి తేజ పని నిమిత్తం బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపంలో కర్నూలు వైపునకు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు సాయి తేజను అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో శ్రీసాయి డిగ్రీ కాలేజీ సమీపంలో ఆదివారం బైక్‌లో నుంచి జారి కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే జొన్నగిరికి చెందిన బాలాజీ పని మీద బైక్‌పై గుత్తికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో డిగ్రీ కాలేజీ సమీపంలో అదుపు తప్పి బైక్‌లో నుంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి క్రాస్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తున్నాడని సెబ్ పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో మార్నేపల్లి క్రాస్ వద్ద కాపు కాచి నరేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి బైక్, 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నరేష్‌పై కేసు నమోదు చేశారు. దాడులలో ఎస్‌ఐ అలీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన కోన క్షేత్రం
- వేకువజామున శివపార్వతుల కల్యాణం



కోన క్షేత్రంలో రథాన్ని లాగుతున్న భక్తులు



నీటి గుండంలో స్నానమాచరిస్తున్న భక్తులు

యాడికి: కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రంలో రామలింగేశ్వరుడి తిరునాల్లో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం వైభంగా సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు నంద్యాల జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో కోన క్షేత్రానికి తరలివచ్చారు. ముందుగా ఆలయం ఎదురుగా ఉన్న నీటి గుండంలో స్నానమాచరించి కోన రామ లింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు, కోనా బ్రదర్స్ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తేరు వరకు తీసుకు వచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువు దీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, కోనా బ్రదర్స్ వెంకట శివారెడ్డి, జగదీశ్వర రెడ్డి, దేవనాథ రెడ్డి, మోహన్‌రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు రామలింగేశ్వర స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది.

వేకువజామునే రామలింగేశ్వరుడి కల్యాణం

ఆదివారం వేకువ జామున 4 గంటలకు ఆలయ ఆవరణలో స్వామికి కల్యాణోత్సవాన్ని అర్చకులు పరమేశ్వర శర్మ కోనా జగదీశ్వరరెడ్డి దంపతుల చేత జరిపించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామికి అక్షింతలు సమర్పించి ఆశీస్సు లు పొందారు. తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలగంగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్క భజన చూపరులను ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు కోనా బ్రదర్స్, రాయలచెరువు వేదవతి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం నాగేంద్ర భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ , సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

శివాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు:

మండలంలో శివరాత్రి పండుగ సందర్భంగా శివాలయాల వద్ద భక్తులు జాగరణ చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. యాడికిలో భైరవేశ్వర ఆలయంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు శివపార్వతులకు కల్యాణం జరిపించారు. రాయల చెరువులోని గౌరీ శంకర దేవాలయం, నిట్టూరు, దైవాలమడుగు రాముల గుడి వద్ద, చందనలో రామలింగేశ్వర స్వామి సన్నిధిలో కల్యాణం, అన్నదానం నిర్వహించారు.

ఘనంగా మసూద్ గాజి ఉరుసు



పూలు, చక్కెరతో ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండల కేంద్రంలో ఆదివారం హజరత్ మసూద్ గాజి ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గంధం దర్గా చేరిన తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ వైస్ చైర్మన్ అహ్మద్‌బాషా, జాయింట్ సెక్రటరీ ఖాజా, ఫయాజ్, షెక్షావలి, ఖమర్‌తాజ్ తదితరులు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ముతవల్లి, ,ముజావర్లు, కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇరుసు పందెంలో పలువురు యువకులు ఉత్సహంగా పాల్గొన్నా ఎవరు ఎత్తకపోవడంతో పందెం నిలిపివేశారు. రాత్రి ఖవ్వాలి పోటీ జరిగింది.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక ప్రార్థనలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు దర్గా చేరుకుని గాజి సమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ హిందూముస్లింలు కలిసి ఉరుసును జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి నూర్‌మహమ్మద్ ఇంటి దగ్గర నుంచి చక్కెర , పూలుతో ఊరేగింపుగా వెళ్లారు. దర్గాలో చదివింపులు చేయించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి నూర్ మహమ్మద్, సర్పంచ్ నాగమునెమ్మ, వైస్ ఎంపీపీ విజయ, ఎంపీటీసీ ఉమా, కోఆప్షన్ మెంబర్ ఆలీ, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు భాస్కర్, భాస్కర్‌రెడ్డి, రాజు, జెల్లి శ్రీనివాసులు, బెస్త వెంకటనారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో ఎంపీ



చిన్నారులను అభినందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, పైలా నర్సింహయ్య తదితరులు

తాడిపత్రి టౌన్ : స్థానిక బుగ్గరామలింగేశ్వరుడిని ఆదివారం రాత్రి ఎంపీ తలారి రంగయ్య సందర్శించుకున్నారు. బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఎంపీ రాజరాజేశ్వరీ దేవి, బుగ్గరామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భరత నాట్యాన్ని ఎంపీ తిలకించి చిన్నారులను అబినందించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఈఓ నరసయ్య, కమిటీ సభ్యులు అంబటి రాఘవేంద్రారెడ్డి, రమేష్, హరిప్రసాద్, భగీరథమ్మ, ఆలయ ప్రధాన ఆర్చకులు మహేష్ శర్మ , రవిశర్మ , నందు శర్మ, గిరిశర్మ ఎంపీ, పైలాను సన్మానించారు. ఆయన వెంట కౌన్సిలర్ రంగనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పేరం అమరనాథరెడ్డి, రామశేఖర్, నాగరంగయ్య ఆలయ అధికారి ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు మోస్తుకొస్తున్న చింతల ఆలయ చైర్మన్ బానా నాగేశ్వరరెడ్డి దంపతులు, పాలక వర్గ సభ్యులు

తాడిపత్రి టౌన్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దక్షిణ కాశీగా పిలువబడుతున్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరగనున్న బుగ్గ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఆదివారం చింతల వెంకటరమణస్వామి ఆలయ చైర్మన్ బానా నాగేశ్వరరెడ్డి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు మురళీస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో బుగ్గ ఆలయానికి చేరుకున్నారు. వారికి బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం బానా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శ్రీశైలం, కాణిపాకం, తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానాలకు పట్టువస్త్రాలను అందజేస్తున్నారని, ఈనేపథ్యంలో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణానికి చింతల ఆలయం నుంచి పట్టువస్త్రాలను అందజేయడం గతేడాది నుంచి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో చింతల, బుగ్గ ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్రారెడ్డి, సంజన్న, భూమా హరి, లక్ష్మీదేవి, మధ్యాహ్నలత, రమాదేవి, భగీరథమ్మ, రమేష్ హరి ప్రసాద్, ఆలయ ఆర్చకులు మహేశ్వరశర్మ, శంకరయ్య, గిరిశర్మ, నందు శర్మ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా చితంబరస్వామి తిరునాల



చితంబరస్వామిని దర్శించుకున్న ఎంపీ తలారి రంగయ్య, ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె: పెనకచెర్లలో ఆదివారం చితంబర స్వామి తిరునాల సందడిగా సాగింది. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి చితంబర స్వామిని దర్శించుకు న్నారు.ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. చితంబరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో గ్రామవీధులు కిటకిటలాడాయి. గాజులు, మిఠాయి, ఆట బొమ్మల అంగళ్ల ఏర్పాటుతో సందడి నెలకొంది. భక్తుల సౌకార్యార్థం అన్నదానం నిర్వహించా రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచు బచ్చలన్న, ఆలయ కమిటీ చైర్మన్ పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగలింగారెడ్డి, రామచంద్రారెడ్డి, జయరాములు, రామాంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే వైవీఆర్ పూజలు



శివుడికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్ దంపతులు

గుంతకల్లుటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కొనకొండ్ల గ్రామంలోని శ్రీ ఛాయా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, శారదమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి బిల్వార్చన, పంచామృత, రుద్రాభిషేకం చేపట్టారు. ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు ఆయన సోదరుడు శాసనమండలి సభ్యులు వై.శివరామిరెడ్డి, ఉమాదేవి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

కనుల పండువగా బీరప్ప స్వామి రథోత్సవం



బీరప్ప స్వామి రథాన్ని లాగుతున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులో బీరప్ప స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి కొలువుదీరిన రథాన్ని ముందుకు లాగారు. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం నుంచి తిరిగి బీరప్ప ఆలయం వరకు రథోత్సవం జరిగింది. భక్తాదులు పెద్ద సంఖ్యలో రథోత్సవాన్ని తిలకించారు. హరహర మహాదేవ శంభో శంకర, బీరప్ప స్వామి నామస్మరణలతో పరిసరాలు హోరెత్తాయి. ఆలయ కమిటీ పెద్దలు పూజారి బసప్ప, పూజారి లింగప్ప, పూజారి మందాలప్ప, లింగన్నగౌడ్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, కౌన్సిలర్ కె.లింగన్న, సోమశేఖర్, నీలకంఠ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూసపల్లిలో చీనీ చెట్ల నరికివేత



పొలంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

యల్లనూరు: చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసిన ఘటన వెన్నపూసపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి తన కున్న ఐదెకరాల పొలంలో నాలుగేళ్ల క్రితం చీనీ మొక్కలను సాగు చేశాడు. అయితే శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 10 చీనీచెట్లు, 3 నెలల వయస్సు ఉన్న 5 చీనీమొక్కలను నరికివేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరాతీశారు. మధ్యాహ్నం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు గృహసారథుల సమావేశం

శింగనమల: శింగనమలలోని రామాలయం వద్ద సోమవారం మండలంలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ యోగేశ్వరి కోరారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరుకావాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి మాఘమాస పూజలు



ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌కు ఆకుపూజ , పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంజునాథ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు



గోవిందపల్లిలో రాచయ్య స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

బుక్కరాయసముద్రం: శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మహా శివునికి అభిషేకాలు నిర్వహించారు. కూచి పూడి నాట్యం ప్రదర్శన జరిగింది. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. గోవిందపల్లి గ్రామంలో రాచయ్య స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేత కాశీ విశ్వనాథ్‌రెడ్డి గ్రామంలో అన్నదానం నిర్వహించారు.

26న రాఘవేంద్రస్వామి జయంతి

తాడిపత్రి టౌన్ : స్థానిక గాజుల క్రిష్టప్పవీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో ఈనెల 26న రాఘవేంద్రస్వామి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకం, మధ్యాహ్నం రథోత్సవం, అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటుందని పేర్కొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత

యాడికి: దాతలు వితరణ చేసిన క్రీడా దుస్తులు సద్వినియోగం చేసుకొని మంచి క్రీడాకారులుగా రాణించాలని గుడిపాడు ఉప సర్పంచు శ్రీనివాసులు పేర్కొన్నారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు లేకపోవటంతో సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెంకటరామి రెడ్డి ఆదివారం క్రీడా దుస్తులు అందించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పేరం సునీత, డీలర్ రామచంద్రుడు, రాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ వాహనం బోల్తా



పామిడి: 44వ నంబర్ జాతీయ రహదారిపై స్థానిక అంబేడ్కర్ కాలనీ సర్కిల్ కూడలిలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ వాహనం బోల్తా పడింది. ఏఎస్‌ఐ మహమ్మద్ వలి తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం తుమకూరుకు చెందిన గౌడ్ ఐచర్ వాహనం మెడిసిన్ దోసకాయ లోడ్‌తో హైదరాబాద్ నుంచి తమకూరుకు బయలుదేంది. స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగంగా వస్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పై బోల్తా పడింది. విద్యుత్‌స్తంభం విరిగినా డ్రైవర్ రాజు, క్లీనర్ రవి సురక్షితంగా బయటపడ్డారు. వాహనం పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంతో డ్రైవర్, క్లీనర్ అక్కడి నుంచి పరారయ్యారు. ఏఎస్‌ఐ మహమ్మద్ వలి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలంలోని ఐచర్ వాహనాన్ని క్రేన్ సాయంతో తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

నయన మనోహరం..రథోత్సవం



రథోత్సవంలో పార్వతీ పరమేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డులోని శ్రీకాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రథోత్సవం ఆదివారం రాత్రి కొనసాగింది. ఆదిదంపతుల బ్రహ్మ రథోత్సవం భక్తులను పరవశులను చేసింది. ఉదయం మడుగు తేరును నగర వీధుల్లో ఊరేగించారు. కాశీవిశ్వేశ్వరుడికి ఉదయం సుప్రభాత సేవలు, మహన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, అర్చనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాత్రి పలు రకాల పూలతో అలంకరించిన పూలరథంపై పార్వతీ పరమేశ్వరులు పురవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు. ఆదిదేవుడి బ్రహ్మరథోత్సవం పురవీధుల్లో కనుల పండువగా సాగింది. కళా రూపాల ప్రదర్శనలు, వేదమంత్రాల ఘోష్టి, భక్తుల శివ నామ స్మరణల నడుమ సాగిన రథోత్సవానికి భక్తులు అడుగడుగునా భక్తి నీరాజనాలర్పించారు. ఆలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు



పామిడిలో ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీహెచ్‌పీ అరక్షిత శిశుమందిరంలో హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు సి.రవి, వీహెచ్‌పీ నాయకుడు కెవి.రామయ్య మాట్లాడుతూ యువత శివాజీని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. శివాజీ మహరాజ్ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు బండిమురళి, శ్రీనివాసులు, శివ, మోహన్‌నాయుడు, చరణ్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను కోట యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట యూత్ నాయకులు రామకృష్ణ, మనోజ్, పాపు, విజయ్‌లు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఎంతో ధైర్యశాలన్నారు. ఆయన దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. యువతీ యువకులందరూ ఛత్ర పతి శివాజీ అడుగు జాడల్లో నడవాలని సూచించారు.

పామిడి: పట్టణంలో ఆదివారం భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 393 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాజీ చిత్రపటాన్ని అశ్వ, హంస వాహనం ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక పెద్ద విఠోబ ఆలయం నుంచి గుత్తి బీసీసీరోడ్డులోని ఛత్రపతి శివాజీ విగ్రహం వరకూ ఊరేగింపు సాగింది. అక్కడ శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక చిన్న విఠోబ ఆలయంలో సామూహిక భోజనాలు ఆరగించి ఆనందోత్సాహాల నడుమ ఛత్రపతి శివాజీ వేడుకలను జరుపుకున్నారు. భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు శ్రీనివాసరావు, జోజోడే కుమార్, రాజశేఖర్, ముకుందా, జగని రవి, మంజునాథ్‌రావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.